హడలెత్తిస్తున్న అల్లరిమూకలు

- చిట్టివలస శివారులో గంజాయి బ్యాచ్ తిష్ట
- దివీస్ ఉద్యోగులపై దాడులు
- చీకటి పడితే స్థానికుల్లో భయం
- బిక్కుబిక్కుమంటూ జీవనం



గంజాయి బ్యాచ్‌లకు అడ్డాగా ఉన్న చిట్టివలస శ్మశానవాటిక



వీధిదీపాలు, సీసీ కెమెరాలు లేని గోస్తనీనది వంతెన అప్రోచ్ రోడ్డు



ఇటీవల ఆకతాయిలు ప్రవేశించిన సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహం

తగరపువలస: చిట్టివలస శివారు శ్మశానవాటికలో గంజాయి బ్యాచ్ ఆగడాలు శృతి మించుతున్నాయి. రాత్రి వేళల్లో ఆ ప్రాంతం నిర్మానుష్యంగా ఉండటం, వీధి దీపాలు కూడా వెలగక అంధకారం నెలకొనడంతో వారి ఇష్టారాజ్యమైపోతోంది. గోస్తని నది వంతెన అప్రోచ్ రోడ్డులో చీకటిపడిన తరువాత రాకపోకలు సాగించే దివీస్ ఉద్యోగులను ఈ బ్యాచ్ టార్గెట్ చేసింది. ఒకవైపు అంధకారం, మరోవైపు అల్లరిమూక ఆగడాలతో రాత్రయితే చాలు ఆ మార్గంలో రావాలంటేనే హడలిపోతున్నారు.

చిట్టివలస శివారు శ్మశాన వాటిక కేంద్రంగా ఇటీవల రాత్రి వేళ ఐదుగురు ఆకతాయిలు గల గంజాయి బ్యాచ్ హల్‌చల్ చేసింది. స్థానికులు ప్రతిఘటించడంతో వారంతా అక్కడికి దగ్గరలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం ప్రహరీ దాటి లోపలికి ప్రవేశించారు. అనంతరం దాని వెనుక నివాసం ఉంటున్న స్థానికులను భయభ్రాంతులకు గురి చేశారు. స్థానికులు ఏకమై ఇద్దరిని పట్టుకుని ఆ రోజు రాత్రి 11 గంటల సమయంలో భీమిలి పోలీసులకు అప్పగించారు. దీనిపై భీమిలి సీఐ బి.సుధాకర్ ఈ ప్రాంతంలో అప్పట్లో విచారణ చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ ప్రాంతంలో రాత్రి 9 గంటల తరువాత ఆకతాయిలు తిష్ట వేసి ఒంటరిగా వెళ్లేవారిపై దాడులకు పాల్పడుతున్నారని స్థానికులు తెలిపారు. రాత్రి 2గంటల వరకు వీరి బెడద కారణంగా కంటిమీద కునుకు లేకుండా ఉంటున్నామని వాపోతున్నారు. ఈ ప్రాంతంలో వీధి లైట్లు పునరుద్ధరించి, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు నిత్యం పోలీస్ నిఘా ఉంచాలని కోరుతున్నారు.

శ్మశానవాటికే వారి అడ్డా

చిట్టివలస శ్మశానవాటికను గంజాయి బ్యాచ్ అడ్డాగా చేసుకుంది. సుమారు ఐదుగురు నుంచి ఏడుగురు వ్యక్తులు చీకటి పడిన తరువాత అక్కడే తిని, అక్కడి షెడ్డులో పడుకుంటున్నారు. అంతేకాకుండా శ్మశానవాటికలోని పుర్రెలను తవ్వితీసి గట్లపై పెడుతూ అటుగా వెళ్లేవారు భయపడేలా చేస్తున్నారు. అడపాదడపా అక్కడ చీకటిగా ఉన్న నిర్మానుష్య మార్గంలో ప్రయాణించే వారిపై దాడులు చేస్తున్నారు. ముఖ్యంగా దివీస్ ఉద్యోగులు 24 గంటలూ ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నందున, వారిపై దాడులు చేస్తున్నారు. మరోవైపు .. స్థానిక సాంఘిక సంక్షేమ వసతిగృహంలో కాపలాదారుడు, సీసీ కెమెరాలు లేకపోవడంతో పాటు ప్రహరీ ఎత్తు కూడా ఉండటంతో దూకి, లోపలికి ప్రవేశిస్తున్నారు.

పిల్లల్ని బయటకు పంపాలంటే భయం



కొండపేట–గుడివాడ, చిట్టివలస–గుడివాడ రోడ్డులో ఆకతాయిల బెడద ఎక్కువగా ఉంది. దీంతో చీకటి పడిన తరువాత పిల్లలను బయటికి పంపాలంటేనే భయమేస్తోంది. దీంతో ట్యూషన్లకు, డ్యాన్స్ క్లాసులకు కూడా పంపలేకపోతున్నాం. అధికారులు స్పందించి ఆకతాయిల బెడద అరికట్టాలి.

– వెంపాడ సూర్యకుమారి, చిట్టివలస

హాస్టల్‌కు వాచ్‌మన్‌ను నియమించాలి



సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహానికి కాపలాదారుడు లేరు. ఆకతాయిలు గోడ దూకి హాస్టల్లోకి వెళ్లినప్పుడు హాస్టల్లో పిల్లలు లేరు కాబట్టి సరిపోయింది. లేదంటే ఆరోజు రాత్రి జరిగిన సంఘటనకు చిన్నారులు భయపడేవారు. హాస్టల్‌కు వాచ్‌మన్‌ను నియమించి, రాత్రి వేళల్లోనూ పిల్లలకు రక్షణ కల్పించేలా చూడాలి.

– ఎం.జ్యోతి, చిట్టివలస

వీధి లైట్లు పునరుద్ధరించాలి



శ్మశానవాటిక రోడ్డు, వంతెన అప్రోచ్‌రోడ్డు, హాస్టల్ వెనుక కొండభాగంలో వీధిలైట్లు వెలగడం లేదు. చీకటి కారణంగా ఆకతాయిలు ఈ ప్రాంతాన్ని ఎంచుకుంటున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి, వీధిలైట్లు పునరుద్ధరించాలి.

– లక్ష్మి సాహు, చిట్టివలస

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



ఇక్కడి శివారు ప్రాంతంలో ఆగంతకులు తరచూ దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇక్కడ రెండు జెడ్పీ హైస్కూళ్లు, ఒక డిగ్రీ కళాశాల, ఐదు ఆలయాలు, ఒక హాస్టల్, రెండు ప్రైవేట్ హైస్కూళ్లు ఉన్నాయి. దీంతో ఎంతోమంది సంచరిస్తుంటారు. అధికారులు దృష్టి సారించి, ఇక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి.

– నూలు అరుణ

పోలీసులు నిఘా పెట్టాలి



చిట్టివలస శివారు ప్రాంతంలో గోస్తని నది పరిసరాలు, కొండభాగం, శ్మశానవాటిక, సాయంత్రం మూతపడే విద్యాసంస్థలు.. ఆకతాయిలకు అనుకూలంగా ఉన్నాయి. దీంతో ఆ ప్రాంతాలను వారికి అడ్డాగా మార్చుకున్నారు. ఇక్కడ పోలీసుల నిఘా ఉంటే స్థానికులకు భరోసా ఉంటుంది.

– ఊర్మిళా సాహు

క్లుప్తంగా

రాస పోలమాంబకు బంతిపూల అలంకరణ



బంతిపూల అలంకరణలో రాస పోలమాంబ

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస పంచాయతీ గ్రామదేవత రాస పోలమాంబ అమ్మవారిని భక్తులు మంగళవారం ఎరుపు, పసుపు బంతిపూల దండలు, గజమాలలతో అలంకరించారు. స్థానిక పోస్ట్‌మ్యాన్ డొకర శ్రీను, లక్ష్మి దంపతులు అలంకరణకు సహాయ సహకారాలు అందించారు. తుపాకుల అప్పల రాసయ్య, రాసమ్మ దంపతులు భక్తులకు ప్రసాదాలు అందించారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన పలువురు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

బబ్బేలమ్మకు 108 కలశాలతో జలాభిషేకం



అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న పూజారి

పీఎం పాలెం: బబ్బేలమ్మ అమ్మవారికి మంగళవారం 108 కలశాలతో జలాభిషేకం చేశారు. దసరా ఉత్సవాలు ముగిసిన తరువాత అమ్మవారికి జలాభిషేకం చేయడం ఆనవాయితీగా వస్తోంది. పీఎం పాలెం, పాత పీఎం పాలెం, పిలకవానిపాలెం తదితర ప్రాంతాలకు చెందిన మహిళలు కలశాలతో నీటిని తీసుకువచ్చి అమ్మవారికి అభిషేకించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పోతిన శ్రీనివాసరావు, సూర్యారావు, బాలాజీ, నాయుడు తదితరులు పాల్గొన్నారు

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన అవసరం



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కొమ్మాది: రొమ్ముక్యాన్సర్ అవగాహన వారోత్సవాల సందర్భంగా గీతం ఆసుపత్రిలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిమ్సర్ ప్రో వైస్ చాన్స్‌లర్ డా. వై.గీతాంజలి మాట్లాడుతూ దేశంలోని మహిళల్లో రొమ్ముక్యాన్సర్‌పై అవగాహన పెరగాలన్నారు. ముఖ్యంగా చిన్నపాటి పరీక్షల ద్వారా రొమ్ము క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించి, చికిత్స పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డా.వసంతకుమార్, జనరల్ సర్జరీ విభాగం అధిపతి డా.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

అందరూ చదువుకోవాలన్నదే ‘ఉల్లాస్’ లక్ష్యం



మాట్లాడుతున్న ఎంపీడీవో జానకి

తగరపువలస: అందరూ చదువుకోవాలి అనే లక్ష్యంతో ‘అండర్‌స్టాండింగ్ ఆఫ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ’(ఉల్లాస్) పథకం పనిచేస్తోందని ఆనందపురం ఎంపీడీవో జానకి తెలిపారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ పథకం గురించి ఆమె వివరించారు. జాతీయ విద్యావిధానం–2020ని అనుసరించి ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం, జీవన నైపుణ్యాలు, వృత్తి నైపుణ్యాలు, ప్రాథమిక విద్య, నిరంతర విద్య ప్రజలకు అందించడం జరుగుతుందన్నారు. 15 ఏళ్ల పైబడిన వారికి ప్రాథమిక విద్యతో పాటు సాంకేతిక విద్య అందిస్తారన్నారు. దీనికోసం గ్రామాలలో వీఏవోలు 1652 మంది అభ్యాసకులను ఎంపిక చేస్తారన్నారు. అభ్యాసకులకు శిక్షణ ఇవ్వడానికి ప్రతి పది మందికి ఒక వలంటీర్‌ను నియమిస్తామన్నారు. మండల స్థాయి పర్యవేక్షణ బాధ్యతలను తనతో పాటు వయోజన విద్యాశాఖ నిర్వహిస్తుందని చెప్పారు. ఏరియా కో–ఆర్డినేటర్ సత్యంనాయుడు, పంచాయతీ విస్తరణ అధికారి సత్యనారాయణ, వెలుగు ఏపీఎం ఆదినారాయణ, ఐసీడీఎస్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం సహించం



మధురవాడతో పారిశుధ్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న వైద్యాధికారి

మధురవాడ: పారిశుధ్య పనుల నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని జీవీఎంసీ జోన్–2 ఏఎంహెచ్‌వో కిషోర్ హెచ్చరించారు. 6వ వార్డు గాయత్రినగర్, 7 వార్డు మధురవాడల్లో పారిశుధ్య పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. గాయత్రినగర్ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ 9వ బ్లాకు వద్ద పేరుకు పోయిన చెత్త తొలగింపు పనులను పరిశీలించారు. మధురవాడలోని ఇతర ప్రాంతాల్లో ఈ పనులు పర్యవేక్షించి, ఆయన మాట్లాడారు. ముఖ్యంగా నివాస ప్రాంతాలలో కాల్వలతో పాటు, మురుగు నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను నిత్యం శుభ్రం చేయాలని సూచించారు. ఈ ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణపై సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో పలువురు ఫిర్యాదు చేశారు. దీనిపై సాక్షి దినపత్రికలో జోన్–2లో పారిశుధ్య నిర్వహణ అధ్వానం శీర్షికతో మంగళవారం ప్రచురితమైన వార్తపై ఆయన స్పందించి చర్యలు చేపట్టారు.

ధరల అదుపులో ప్రభుత్వం విఫలం



ర్యాలీ నిర్వహిస్తున్న పైడిరాజు తదితరులు

మధురవాడ: ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలు అదుపు చేయలేకపోతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు అన్నారు. దీంతో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిత్యావసర వస్తువుల ధరల పెంపునకు వ్యతిరేకంగా ఆ పార్టీ చేపట్టిన ప్రచారోద్యమంలో భాగంగా 7వ వార్డు మల్లయ్యపాలెం, అయోధ్యనగర్, కొత్తపాలెం తదితర ప్రాంతాలలో విస్తృతంగా కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ నిత్యావసర వస్తువులను పౌర సరఫరాలు శాఖ ద్వారా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి వైఎస్ఆర్‌సీపీ నాయకుడు అల్లాడ లింగేశ్వరరావు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎంఏ బేగం, ఏరియా కార్యదర్శి వాండ్రాసి సత్యనారాయణ, కొల్లి భాస్కరరావు, కాసూరి రామారావు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ బందోబస్తు నడుమ సర్వే



సర్వే చేస్తున్న భూముల వద్ద పోలీసులు

పద్మనాభం: మండలంలోని బాందేవపురంలో వివాదాస్పదంగా మారిన భూమిలో పోలీస్ బందోబస్తు నడుమ రెవెన్యూ సిబ్బంది మంగళవారం సర్వే నిర్వహించారు. సర్వే నంబర్ 40/1లోని 5 ఎకరాల భూమికి సంబంధించి ఎ.రాజావర్మ, ఎస్.సన్యాసిరాజు కుటుంబీకుల మధ్య వివాదాలు తలెత్తాయి. దీంతో రాజా వర్మ గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ భూమి ఎవరిదో నిర్ధారణ చేసేందుకు రెవెన్యూ సిబ్బంది సర్వే చేయడానికి సిద్ధమయ్యారు. దీంతో రాజా వర్మ, సన్యాసిరాజు కుటుంబీకుల మధ్య వాగ్వాదం జరిగింది. అరుపులు, కేకలు వేయడంతో సర్వేకు ఆటంకం కలిగింది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. తహసీల్దార్ కె.ఆనంద కుమార్ సమక్షంలో పోలీస్ బందోబస్తు మధ్య సర్వే చేశారు.

దాతలకు సత్కారం



కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసిన దాతలను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

తగరపువలస: శంకర్ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, వారు ఎంచుకున్న కంటి అద్దాలను ఉచితంగా అందించడానికి స్థానిక బైపాస్ రోడ్డులోని ఎంఎస్ఆర్ కల్యాణమండపం అధినేత కిషోర్ ముందుకు వచ్చారు. మండలంలోని ప్రతి పాఠశాలలో ఈ సేవలు కొనసాగిస్తామన్నారు. ఈ మేరకు భీమిలి మండలం దాకమర్రి జెడ్పీ హైస్కూల్‌లో ఈ సేవలను మంగళవారం ప్రారంభించి, 200 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం నిర్వాహకులను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ చెల్లూరి పైడప్పడు, ఎంపీటీసీ సభ్యుడు చెల్లూరి నగేష్, పాట్నూరు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని తాపీ మేస్త్రి మృతి



ఆనందరావు (ఫైల్)

పీఎం పాలెం: మనస్తాపంతో ఓ వ్యక్తి ఉరి వేసుకుని మరణించిన సంఘటన పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలివి.. శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం చిన్నయ్యపేట గ్రామానికి చెందిన మీసాల ఆనందరావు(32) తాపీ మేస్త్రి పనులు చేస్తుంటాడు. పీఎం పాలెంలోని సాంకేతిక ఇంజినీరింగ్ కళాశాల వెనుక ఉన్న సూర్యతులసీ నగర్‌లోని ఓ రేకుల షెడ్‌లో భార్య సంతోషి, పిల్లలతో నివసిస్తున్నాడు. తాగుడుకు బానిస అయిన ఆనందరావు భార్యా పిల్లలను పట్టించుకోకపోవడంతో నాలుగు రోజుల కిందట పిల్లలను వెంట తీసుకుని భార్య రణస్థలం మండలంలోని పుట్టింటికి వెళ్లిపోయింది. ఆనందరావు సోమవారం రాత్రి అదే ప్రాంతంలో నివసిస్తున్న పిన్ని ఇంటి వద్ద భోజనం చేసి, అక్కడే పడుకున్నాడు. మంగళవారం ఉదయం 6.30గంటలకు తన ఇంటికి వచ్చేశాడు. పరదేశిపాలెంలో నివసిస్తున్న ఆనందరావు తండ్రి జగన్నాధరావు కొడుకుకు ఫోన్ చేయగా ఫోన్ ఎత్తలేదు. అనుమానం వచ్చి ఉదయం 8–30 గంటల సమయంలో కొడుకు ఇంటికి వచ్చి, చూడగా ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఉన్నాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో వారు వచ్చి, మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

నేటి నుంచి గ్రామ సభలు

పద్మనాభం: మండలంలో భూముల రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో ఈ నెల 23 నుంచి వచ్చే నెల 20వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ కె.ఆనందకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23న ఐనాడ, 26న బుడ్డివలస, 29న బుడ్డివలస–అగ్రహారం, 30న జానకీదేవిపేట గ్రామాల్లో ఈ సభలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. అలాగే, వచ్చే నెల ఒకటిన నేరెళ్లవలస, 2న చిన్నాపురం, 5న తునివలస, 6న నరసాపురం, 7న కోరాడ, 8న వెంకటాపురం, 12న రేవిడి, 13న అనంతవరం, 14న పెంట, 15న తిమ్మాపురం, 16న విజయరాంపురం, 19న బాందేవపురం, 20న మద్ది గ్రామాల్లో సభలు ఉంటాయని తెలియజేశారు. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ గ్రామ సభలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ గ్రామ సభల్లో పేర్లు, సర్వే నంబర్లు వంటి వాటిపై రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్టు తహసీల్దార్ తెలిపారు.

బదిలీ అయిన రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌కు సత్కారం



మోహనరావును సత్కరిస్తున్న మురళీకృష్ణ

పీఎం పాలెం: జీవీఎంసీ ఆరోవార్డులోని ఏపీఎస్‌పీ పోలీస్ బెటాలియన్‌లో పని చేస్తూ విజయవాడ కౌంటర్ ఇంటెలిజెన్స్‌కు ఇటీవల బదిలీ అయిన రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ బి.మోహన్‌రావును మంగళవారం ఘనంగా సత్కరించారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో 16వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ కేవీ మురళీకృష్ణ ఆయన్ను సన్మానించారు. అంతకు ముందు జరిగిన సిబ్బంది దర్బారులో వృత్తిపరమైన, వ్యక్తిగత సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మందుబాబులకు రూ.1.50 లక్షలు జరిమానా

తగరపువలస: ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 15 మందికి మంగళవారం భీమిలి 15వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ డి.సౌజన్య జరిమానా విధించారు. ఒక్కొక్కరికి రూ.10వేలు వంతున మొత్తం రూ.1.50 లక్షలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు తెలిపారు.

పీఎం పాలెం పరిధిలో రూ.1.6 లక్షలు

పీఎం పాలెం: పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో 16 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. వారిని మంగళవారం కోర్టు ముందు హాజరు పరచగా న్యాయస్థానం ఒక్కొక్కరికీ రూ.10వేల వంతున లక్షా 60 వేల రూపాయలు జరిమానా విధించిందని పేర్కొన్నారు.

ప్రమాదకరంగా జ్యూట్‌మిల్లు ప్రహరీ



శిథిలావస్థకు చేరుకుని ఎక్కడికక్కడ కూలిపోతున్న ప్రహరీ

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు ప్రహరీ పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని కూలడానికి సిద్ధంగా ఉంది. ఇటీవల వర్షాలకు, అక్కడక్కడ ప్రహరీ భాగం కుప్పకూలిపోతోంది. 2009లో మిల్లు లాకౌట్ తరువాత నిర్వహణ లేకపోవడంతో ప్రహరీ పూర్తిగా పటుత్వం కోల్పోయింది. 2019 తరువాత మిల్లులోని ఆస్తులు తరలించడంతో ప్రహరీ అవసరం లేకుండా పోయింది. దీంతో మిల్లుకు మూడు వైపులా ప్రహరీలను కూల్చి, స్థలాలను కూడా విక్రయిస్తున్నారు. ప్రస్తుతం మిల్లు దక్షిణ భాగంలో మాత్రమే సుమారు 200 మీటర్ల పొడవునా ప్రహరీ ఉంది. ఇందులో నుంచి చెట్ల వేళ్లు పొడుచుకుని రావడంతో ప్రహరీ బీటలు వారుతోంది. ఈ ప్రహరీ వైపు బీటీరోడ్డు ద్వారా నిత్యం చిట్టివలస, చిట్టివలస కళ్లాలు, శ్రీరామనగర్, కొత్త మూలకుద్దు గ్రామస్తులు రాకపోకలు సాగిస్తుంటారు. ఆ సమయంలో వీరు ఏ మాత్రం అలక్ష్యంగా ఉన్నా ప్రహరీ కూలితే పెద్ద ఎత్తున ప్రమాదం సంభవించవచ్చని ఆందోళన చెందుతున్నారు. అవసరం లేని ప్రహరీని తక్షణం కూల్చివేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మత్స్యకారులకు దివీస్‌చే ఇంజిన్ల పంపిణీ



మత్స్యకారులకు ఇంజిన్లు పంపిణీ చేస్తున్న దివీస్ అధికారులు

తగరపువలస: భీమిలి మండలం పెదనాగమయ్యపాలెం పంచాయతీలో 20 మంది చిన్నబోట్ల మత్స్యకార యజమానులకు దివీస్ లేబొరేటరీ యాజమాన్యం మంగళవారం రూ.17.80 లక్షలు విలువ చేసే 10 హెచ్‌పీ సామర్థ్యం గల ఇంజిన్లు పంపిణీ చేసింది. కార్యక్రమంలో జిల్లా మత్స్యకార విభాగం జాయింట్ డైరెక్టర్ జి.విజయ, ఏడీ విజయకృష్ణ, ఎఫ్ఏ ఉమామహేష్ తదితరులు మాట్లాడారు. సముద్రంపై వేటకు వెళ్లేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో సంస్థ సీఎస్ఆర్ ప్రతినిధులు డి.సురేష్‌కుమార్, ఎ.శ్రీనివాస్, కె.నరసింహ, స్థానిక పెద్దలు డీఏఎన్ రాజు, వెంకటప్పడు, అప్పారావు, పరశురాం, లక్ష్మణ్, గురుమూర్తి, రాజు తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి రైతులకు ప్రోత్సాహకాలు



అమనాంలో రైతులతో మాట్లాడుతున్న భీమిలి ఎంపీపీ వాసురాజు

తగరపువలస: కొబ్బరి సాగు చేసే రైతులకు ప్రభుత్వం తరపున ప్రోత్సాహం అందించనున్నట్టు భీమిలి ఏవో బి.శివకోమలి తెలిపారు. భీమిలి మండలం అమనాం, అన్నవరం పంచాయతీలలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా భీమిలి ఎంపీపీ దంతులూరి వెంకట శివ సూర్యనారాయణరాజు (వాసు రాజు) హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ కొత్తగా కొబ్బరి వేసే రైతులకు మొక్కకు రూ.40 వంతున సబ్సిడీ అందిస్తున్నామన్నారు. 15 సంవత్సరాలు దాటిన పాత తోటలు తొలగించే కార్యక్రమంలో భాగంగా మొక్కకు రూ.వెయ్యి అందిస్తామన్నారు. కొబ్బరి మొక్కల సస్యరక్షణలో భాగంగా హెక్టారుకు రూ.17వేలు, గరిష్టంగా రూ.53వేల సబ్సిడీ రైతుకు అందిస్తామన్నారు. కొబ్బరి చెట్లు ఎక్కి పంటకోత కోసేవారికి రూ.94తో బీమా సదుపాయం కల్పిస్తున్నట్టు తెలిపారు. రాగి, నువ్వుల విత్తనాలు నవంబరు చివరి వరకు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖాధికారి పి.స్వాతి, సహాయ ఉద్యానవనశాఖాధికారి భువన ప్రత్యూష, మార్కెటింగ్ విభాగం తరపున మీరాబాయి తదితరులు పాల్గొన్నారు.

పెద్దిపాలెం, గంభీరంలో..

ఆనందపురం మండలం పెద్దిపాలెం, గంభీరం పంచాయతీలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి కొత్తూరు అప్పలస్వామి, ఏవో చావా సంధ్యారత్నప్రభ పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయం యొక్క ఆవశ్యకత గురించి తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో త్రినాథ్ కూరగాయల సస్యరక్షణ, వెజిటబుల్ పథకం గురించి వివరించారు. వ్యవసాయశాఖ అసిస్టెంట్ షేక్ అహ్మద్‌గౌస్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో విద్యార్థులకు పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

తగరపువలస: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చిత్తూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జూడో అండర్–14, 17 విభాగాలలో ఆనందపురం మండలం శొంఠ్యాం, వేములవలస విద్యార్థులు ఒక స్వర్ణం, మూడు కాంస్య పతకాలు సాధించారు. శొంఠ్యాంకు చెందిన ఎస్.భాగ్యశ్రీ, సమీర్‌ఖాన్ అండర్–14లో కాంస్య పతకాలు సాధించారు. వేములవలసకు చెందిన ఎం.యశ్వంత్ అండర్–17 విభాగంలో బంగారుపతకం, హాసిని కాంస్య పతకం సాధించారు. బంగారు పతకం సాధించిన యశ్వంత్ నవంబరు 6 నుంచి 9 వరకు జమ్మూ కాశ్మీర్‌లో జరుగనున్న జాతీయస్థాయి జూడో పోటీలలో పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా విద్యార్థులను రొంగలి వెంకటేశ్వరరావు, గవర ఈశ్వరరావు, ఆత్మకూరి గణేష్, లెంక అప్పలరాము తదితరులు అభినందించారు.

సోలార్ దీపాలకు ఏర్పాట్లు



టి.నగరపాలెంలో సోలార్ దీపాలకు స్తంభాలు వేస్తున్న దృశ్యం

తగరపువలస: భీమిలి మండలం టి.నగరపాలెంలో దివీస్ కంపెనీ సీఎస్ఆర్ నిధులతో సోలార్ దీపాలు ఏర్పాటు చేయనున్నారు. ఇందులో భాగంగా మంగళవారం జాతీయరహదారి నుంచి పంచాయతీ కార్యాలయం వరకు స్తంభాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలను సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమి, చంద్రశేఖర్, ఇడదాసరి గోవింద్ తదితరులు పర్యవేక్షించారు.